క్లుప్తంగా

డైవర్షన్ రోడ్డుపై గుంతలు



నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్ వాగు వద్ద రోడ్డు డైవర్షన్ కోసం తాత్కాలికంగా నిర్మించిన వంతనపై ప్రమాదకర గుంతలు ఏర్పడడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ గుంతలతో రోజుకో ప్రమాదం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా అధికారు స్పందించి గుంతలలో కనీసం మొరం మట్టితోనైనా పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

నేడు బీజేపీ సభ్యత్వ నమోదుపై సమీక్ష

ఆత్మకూరు: మండలకేంద్రంలోని జీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ క్రియాశీల సభ్యత్వంపై సోమవారం వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా సభ్యత్వ ప్రముఖ్ ఆర్‌పీ.జయంత్ లాల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర ప్రధానకార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ కాళీప్రసాదరావు, డాక్టర్ సిరంగి సంతోష్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్ గౌడ్ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి మండల బీజేపీ నాయకులు, సభ్యులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

శ్రమదానం



శాయంపేట : మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా గట్లకానిపర్తి నుంచి నర్సింహులపల్లికి వెళ్లే దారిలో పిన్న చెరువు (పింజెరువు) కట్ట మీద ఇరువైపుల ఉన్న ముళ్ల చెట్లను డోజర్‌తో తొలగించారు. ఆర్టీసీ బస్సుకు అన్ని రకాల వాహనాలకు, గ్రామ ప్రజలకు ఇబ్బందిగా ఉన్న ముళ్ల చెట్లను తొగించారు. కమిటీ శ్రమదానం చేయగా గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమానికి అభివృద్ధి కమిటీ ఆర్థిక సాయం అందించారు. గ్రామ అభివృద్ధి కమిటీ కన్వీనర్, కో కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

గుడుంబా రవాణా చేస్తున్న ఒకరి అరెస్ట్



శాయంపేట : గుడుంబా రవాణా చేస్తున్న ఒకరిని అరెస్ట్ చేసి బైకు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. మండలంలోని కొప్పుల గ్రామ శివారులో ఆదివారం ఎక్సైజ్ పోలీసులు రూట్ వాచ్ చేస్తుండగా సూర్యనాయక్ తండా నుంచి కొప్పులకు గుడుంబా రవాణా చేస్తున్న లావుడ్య శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి అతని నుంచి 20 లీటర్ల గుడుంబా లభ్యం కాగా స్వాధీనం చేసుకొని బైక్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, కానిస్టేబుల్ విజయకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



దామెర : మండలంలోని ఊరుగొండ గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన ఆదివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై అశోక్ కథనం ప్రకారం .. ఊరుగొండ గ్రామానికి చెందిన ఇజ్జిగిరి రవీందర్ ఈ నెల 25న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి రాత్రి అయినా ఇంటి రాకపోవడంతో చుట్టుప్రక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. రవీందర్ భార్య సునిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రవీందర్ 5.5 అడుగుల ఎత్తులో ఛామన చాయలో ఉంటాడని ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో మెరూన్ కలర్ షర్ట్, బూడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని ఎవరికైనా కనిపిస్తే దామెర పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని ఎస్సై పేర్కొన్నారు.

ఆర్థికసాయం

సంగెం : మండల కేంద్రానికి చెందిన గుండేటి మహేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి దాతలు ఆదివారం రూ.9,832 సాయం అందజేశారు. తొలుత మహేందర్ చిత్రపటానికి నివాళులర్పించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రమేశ్, మోహన్, నాగార్జున శర్మ ఉన్నారు.

బంతి సాగు.. భలేబాగు

- ఉద్యాన పంటలపై రైతుల మొగ్గు
- పూల సాగుతో అధిక లాభాలు ఆర్జిస్తున్న రైతులు



వల్బాపూర్‌లో సాగు చేసిన బంతి తోట

ఎల్కతుర్తి : పెరిగిన ఖర్చులు తగ్గిన దిగుబడులతో నష్టాల ఊబిలో కూరుకుపోయిన రైతులు వాణిజ్య పంటలకు స్వస్తి చెప్పి ఉద్యానపంటలపై దృష్టి సారించారు. ఎల్కతుర్తి మండలం వల్బాపూర్ గ్రామంలో గత రెండేళ్ల నుంచి వాణిజ్యపంటల సాగు వదిలి ఉద్యాన పంటలపై దృష్టి సారించి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు. రైతులు తమకున్న కొద్దిపాటి వ్యవసాయ భూమిలో బంతి తోటతో పాటు కూరగాయలు క్యాలీఫ్లవర్, బీరకాయ, బెండకాయ తోటలు సాగు చేస్తున్నారు. ఇలా ప్రస్తుతం గ్రామంలోని పలువురు రైతులు బంతి తోట బతుకమ్మ, దీపావళి, సంక్రాంతి పండుగలకు క్రాప్ చేతికందుతుందని రైతులు వెల్లడించారు. సద్దుల బతుకమ్మకు అమ్మిన బంతిపూల దిగుబడితో పెట్టిన పెట్టుబడి వచ్చిందన్నారు. రానున్న దీపావళి, సంక్రాంతికి పండుగలకు వచ్చే దిగుబడితో అధిక లాభాలు ఆర్జించనున్నట్లు రైతులు వివరించారు. ఈ తోటలు వల్బాపూర్ నుంచి వీరనారాయణపూర్, దండేపల్లి గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కనే ఉన్నాయి. ఈ పూలను చూసిన ప్రతి ఒక్కరూ చిన్నా, చితక, శుభకార్యాలతో పాటు వివిధ పూజలకు, వ్రతాలకు, నోములకు ఆర్డర్లు ఇచ్చి పోతున్నారని రైతులు పేర్కొన్నారు. ప్రస్తుతం జరగనున్న పెళ్లిళ్లకు సైతం పూలకు పెద్ద ఎత్తున ఆర్డర్లు వచ్చే అవకాశం ఉందని రైతులు ధీమా వ్యక్తం చేశారు. పూలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడంతో రైతులు బంతిసాగు చేసి అధిక లాభాలు ఆర్జిస్తున్నారు.

కరీంనగర్ పట్టణంలోని తిమ్మాపూర్‌లో బంతి సీడు తెచ్చి సాగు చేసినట్లు రైతు కరుణాకర్ తెలిపాడు.



బంతిపూలు కోస్తున్న దంపతులు

ఒక్క మొక్కకు రూ.5 చొప్పున 12 వేల మొక్కలు 'అశోక సీడ్' తెచ్చి సాగు చేశానని చెప్పారు. దీనికి కూలీల ఖర్చు పెద్దగా ఉండదన్నారు. ఇంట్లోని కుటుంబ సభ్యులు చేసుకుంటే సరిపోతుందని రైతులు తెలిపారు. ఒకసారి గుంటక ఖర్చు, మరో రెండు సార్లు పురుగు సోకకుండా మందులు పిచికారీ చేస్తే సరిపోతుందన్నారు. ప్రస్తుతం సాగుచేసిన బంతి పంట హుజూరాబాద్, జమ్మికుంట, హనుమకొండ పట్టణాలకు తరలిస్తున్నట్లు తెలిపారు.

కూలీల బాధ తప్పింది



గతంలో మొక్కజొన్న పంట సాగుచేశాను. కూలీల ఖర్చు, మందుల ఖర్చు పోను పెద్దగా లాభాలు కనిపించలేదు. కూలీల కొరత ఉండడంతో చేసేది ఏమీలేక బంతిసాగు గురించి తెలుసుకొని మొక్కలు తెచ్చి నాటాను. ఇప్పటి వరకు నష్టం చవిచూడలేదు. గత రెండేళ్ల నుంచి బంతితోట సాగు చేసున్నా. మరో వైపు కూలీల బాధ తప్పింది.

– అంబాల కరుణాకర్, రైతు వల్బాపూర్

ప్రజలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం



కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

- భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

శాయంపేట : రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలవడమే సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పరకాల నుంచి పెద్దకోడెపాక, శాయంపేట మీదుగా వరంగల్‌కు వెళ్తున్న పెద్దాపూర్-వరంగల్ బస్సును మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో పరకాల డిపోకు చెందిన పెద్దాపూర్-వరంగల్ బస్సును పరకాల డిపో మేనేజర్‌తో కలిసి ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. అనంతరం బస్సులో కూర్చొని టికెట్ కొనుగోలు చేసి కొద్ది దూరం ప్రయాణం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎనిమిదేళ్ల క్రితం పరకాల నుంచి శాయంపేట, ఆత్మకూరు, అక్కంపేట, పెద్దాపూర్, మొగిలిచర్ల, ఎనుమాముల మార్కెట్ మీదుగా వరంగల్‌కు వెళ్లే బస్సు రద్దు కావడంతో పనుల నిమిత్తం మండల ప్రజలు ఎనుమాముల మార్కెట్, వరంగల్‌కు వెళ్లేందుకు ఇబ్బందులు పడేవారని తెలిపారు. మండల ప్రజల ఇబ్బందులను గుర్తించి పరకాల డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును పునరుద్ధరించినట్లు తెలిపారు. పేద ప్రజలకు ఎంతో అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ పథకాలు ఉపయోగపడుతున్నాయని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని రైతు వేదికలో రూ. 47లక్షల 5వేల 452 విలువ గల కల్యాణలక్ష్మి చెక్కులను 47 మంది లబ్ధిదారులకు, రూ. 7.54లక్షల విలువ గల 27మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆయన అందజేశారు. కార్యక్రమంలో పరకాల ఆర్డీఓ కన్నం నారాయణ, తహసీల్దార్ సత్యనారాయణ, పరకాల డిపో మేనేజర్ రవిచందర్, మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాష్, పరకాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మారెపల్లి రవీందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, చిందం రవి, మార్కండేయ, శ్రీనివాస్ రెడ్డి, ప్రకాష్ రెడ్డి, సమ్మిరెడ్డి, కుమారస్వామి, కట్టయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. పరకాల వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆదివారం పరకాల పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంను ఎమ్మెల్యే రేవూరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకోవడం జరుగుతుందన్నారు. రైతు రాజ్యం రావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరుకోవడం జరుగుతుందన్నారు. మార్కెట్‌కు చేరుకునే రైతు సమస్యలను పరిష్కరించేదుకు కృషిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, పరకాల పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ మారెపెల్లి రవీందర్, మార్కెట్ డైరెక్టర్స్, పీఏసీఎస్ డైరెక్టర్స్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గ్రానైట్ క్వారీల్లో ఏం జరుగుతోంది ?

- సిండికేట్‌గా మారి శ్రమదోపిడీ చేస్తున్న యాజమాన్యాలు
- అరకొరగా చెల్లిస్తున్న జీతాలు
- ఇబ్బందులు పడుతున్న కార్మికులు



వనమాల కనపర్తిలోని ఓ గ్రానైట్ క్వారీ

ఐనవోలు : మండలంలోని వనమాల కనపర్తి గ్రానైట్ క్వారీలకు అడ్డాగా మారింది. గ్రామం దాటిన తర్వాత క్వారీలకు వెళ్లే దారి సుమారు 4 కిలోమీటర్లు ప్రయాణిస్తే కొండపర్తి గ్రామం వైపు వెళ్తోంది. ఈ అడ్డదారిలో 7 క్వారీలు వీరాంజనేయ, కనకదుర్గ, మారుతి, శ్రీఆంజనేయ, ఎస్ఎస్, గాయత్రి, రైజ్‌ఇన్(ఈస్ట్ కోస్ట్), క్వారీలు వేర్వేరు యజమానులు నడుపుతున్నారు. ఇక్కడ ఏం జరుగుతుందో బయట ప్రపంచానికి తెలియడం లేదు. వీరాంజనేయ క్వారీలో శుక్రవారం బిహార్‌కు చెందిన సుబోధ్ యాదవ్ మృతి చెందిన విషయం బయటకు వచ్చినప్పటికీ ఇటీవల ధర్మసాగర్ మండలం మల్లక్‌పల్లికి చెందిన మునిగాల వెంకటేశ్వర్లు రైస్ ఇన్ (ఈస్ట్ కోస్టు) క్వారీలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం మాత్రం బయటకు రాలేదు. సుబోధ్ యాదవ్ కుటుంబంతో రూ.8 లక్షలతో బేరం కుదుర్చుకోగా వెంకటేశ్వర్లు కుటుంబంతో రూ. 4 లక్షలతో బేరం కుదిరినట్లు సమాచారం.

శ్రమదోపిడీ చేస్తున్న యాజమాన్యాలు

ఇక్కడ యజమానులంతా సిండికేట్‌గా మారి శ్రామికులను శ్రమదోపిడీ చేస్తున్నారు. ఆర్థిక అవసరాలున్న వారిని నియమించుకుని తక్కువ జీతం చెల్లిస్తూ అది కూడా సమయపాలన లేకుండా ఇష్టం వచ్చినపుడు ఇస్తున్నట్లుగా తెలుస్తోంది. ఎక్స్‌వేటర్, గ్రానైట్ కటింగ్ తదితర పనులకు వేరే రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి నెలల తరబడి ఇక్కడే ఉంచుకుని వారికి కూడా అరకొరగానే జీతాలు ఇస్తున్నట్లు తెలిసింది. కొన్ని క్వారీల్లో రాత్రయితే కనీసం వెలుతురు కూడా ఉండదని అక్కడి వారు చెబుతున్నారు. కొన్ని క్వారీల్లో పరిమితంగా సోలార్ లైట్లు వెలుగుతాయి. రాత్రివేళ దోమలు, ఇతర క్రిమి కీటకాలతో పాటు విషసర్పాల బెడద ఉంటుందని తెలుస్తోంది. రాత్రిపూట ఏమైనా అనారోగ్య సమస్యలు వస్తే మాత్రం చాలా ఇబ్బందులు పడాల్సిందే. అటువైపు ఏ శాఖ అధికారి కూడా కన్నెత్తి చూడడం లేదనే విషయం స్పష్టం అవుతుంది. క్వారీల్లో ప్రమాదాలు జరిగి కార్మికులు ప్రాణాలు కోల్పోతున్న బయటి ప్రపంచానికి తెలియకుండా యాజమాన్యాలు రాజకీయ అండదండలతో వ్యవస్థలను మేనేజ్ చేసుకుంటున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులు ఈ 7 క్వారీల్లో పర్యటించి గ్రానైట్ క్వారీకి సంబంధించిన అనుమతులు, అక్కడ పనిచేస్తున్న కార్మికుల స్థితిగతులు, పని ప్రదేశంలో కార్మికులకు కల్పించాల్సిన వసతులు ఇతర సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ధర్నా



కోతులనడుమ వద్ద ధర్నా చేస్తున్న గ్రామస్తులు

ఎల్కతుర్తి: మండలంలోని కోతులనడుమ వద్ద గల హన్మకొండ-కరీంనగర్ ఫోర్‌లైన్ రహదారి పనులు నిర్వహిస్తున్న సందర్భంగా రోడ్డు దాటలేని పరిస్థితి నెలకొందని వెంటనే అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు ఆదివారం రహదారిపై పెద్ద ఎత్తున ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. దీంతో వాహనాలు భారీగా స్తంభించిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని గ్రామస్తులకు నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. అనంతరం నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కార్యక్రమంలో సుమారు 150 మంది గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కార్మికులకు అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

కాజీపేట అర్బన్: మున్సిపల్ కాంట్రాక్టర్ మోసానికి బలైన బాధిత కార్మికులకు త్వరలో భర్తీ చేయనున్న 250 పోస్టుల్లో అవకాశం కల్పించాలని సీఐటీయూ మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బరుపట్ల మహేష్, ఉప్పలయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ ఏకశిల పార్కు ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల 550 మందికి అవకాశం కల్పిస్తామని డబ్బులు దండుకున్న సదరు కాంట్రాక్టర్.. 452 మందికి మాత్రమే అవకాశం కల్పించి చేతులు దులుపుకున్నాడని విమర్శించారు. మిగతా వారికి డబ్బులు కూడా తిరిగి ఇవ్వలేదని పేర్కొన్నారు. త్వరలో భర్తీ చేయనున్న నియామకాల్లో బాధితులకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ విద్యార్థులకు సన్మానం



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే నాగరాజు

విద్యారణ్యపురి: ఎంబీబీఎస్‌లో సీట్లు సాధించిన ఇద్దరు విద్యార్థులను హనుమకొండలో తన నివాసంలో వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆదివారం అభినందించారు. శ్రీవైష్ణవి, బిజిలి సిద్ధార్థకు వైద్య విద్య పరికరాలు అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంబీబీఎస్ వైద్యవిద్య పూర్తయ్యేంత వరకు తనవంతు సహాయ సహకారం అందిస్తానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అధ్యయన కేంద్రం ఉమ్మడి వరంగల్ జిల్లా సంచాలకులు డాక్టర్ జగన్మోహన్, కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య, వర్ధన్నపేట పాక్స్ చైర్మన్ రాజేష్‌ఖన్నా, సకినేని మహబూబియా, సుధాకర్, డాక్టర్ దుర్గాప్రసాద్, నాయకులు రాయపురం సాంబయ్య, కందుకూరి పూర్ణచందర్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

బీమా డబ్బుల అందజేత

సంగెం : మండల కేంద్రానికి చెందిన మెట్టుపల్లి భాస్కర్ కుంటపల్లిలోని ఏకశిల పురుషుల పొదుపు సంఘం సభ్యుడు కాగా ఆయన ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబానికి సంఘం అధ్యక్షుడు కాగితాల జగన్నాథచారి ఆధ్వర్యంలో రూ.82,245 బీమా డబ్బులు కార్యాలయంలో ఆదివారం అందజేశారు. భాస్కర్ సంఘంలో సభ్యుడు కాగా అతడు మృతి చెందడంతో నామినీగా ఉన్న అతడి తల్లి శాంతమ్మకు అభయనిధి, బీమా మొత్తం కలిపి అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు చిర్ర మొగిలి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పగలే వెలుగుతున్న వీధి దీపాలు



నడికూడ : మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యంతో వీధి దీపాలు నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయి. ఆదివారం మండల కేంద్రానికి చెందిన ఓ వాట్సాప్ గ్రూప్‌లో స్థానికులు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతున్న వీధి లైట్లు, పట్టించుకోని గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ కార్యదర్శి, స్పెషల్ ఆఫీసర్ అంటూ షేర్ చేశారు.ఈ సందర్భంగా వారు వీధి దీపాలు కోసం థర్డ్ లైన్ తీగలను ఏర్పాటు చేసి, ఆన్‌ఆఫ్ స్విచ్‌లు ఉన్నా ఆపరేటర్లు లేక, జీపీ అధికారుల నిర్లక్ష్యం, ప్రజాప్రతినిధుల పట్టింపులేని కారణంగా విద్యుత్ వృథా అవడంతో పాటు జీపీల్లో అనవసరపు బకాయిలు భారం అధిక మొత్తంలో పెరుగుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి నిరంతరం వెలుగులను అరికట్టి జీపీలపై పెరుగుతున్న అదనపు ఖర్చు భారాన్ని తగ్గించడానికి తోడ్పాటు అందించాలని గ్రామస్తులు, పలు సంఘాల నాయకులు కోరుతున్నారు.

నరకాసుర వధకు బందోబస్తు

- ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఏర్పాట్ల పరిశీలన



ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఏసీపీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు

ఖిలా వరంగల్: దీపావళి సందర్భంగా ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో ఈనెల 30న నిర్వహించనున్న నరకాసుర వధకు పోలీసు బందోబస్తు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని ఏసీపీ నందిరాం నాయక్ తెలిపారు. ఈమేరకు రంగలీల మైదానంలో జరుగుతున్న ఏర్పాట్లను ఇన్‌స్పెక్టర్ జూపల్లి వెంకటరత్నం, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్లి రవి, సభ్యులతో కలిసి ఏసీపీ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నందిరాంనాయక్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని, వేర్వేరుగా పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఇబ్బందులు కలుగకుండా భారీగేట్లు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు ఏసీపీ సూచించారు. కార్యక్రమంలో శ్యామలరావు, కనుకుంట్ల రవి, గౌతమ్, గౌడ రామ్, దాసరి రాజు , తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

సంగెం : ఆత్మహత్యకు యత్నించిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని బాలునాయక్‌తండా శివారు తొట్ల తండాకు చెందిన మూడు మోహన్ (40) ఈనెల 26న మద్యం మత్తులో ఇంట్లో ఉన్న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు ఆయన్ను వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. మృతుడి తల్లి రమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై సీతారాములు తెలిపారు.

సన్మానం



సుదర్శనాచార్యులును సన్మానిస్తున్న గౌరీశంకర్, తదితరులు

సంగెం: గీసుకొండ మండలంలోని ఊకల్ నాగ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకుడు, జ్యోతిష్య ప్రావీణ్య డాక్టర్ సముద్రాల సుదర్శనాచార్యులును వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్-3 ఆధ్వర్యంలో తొర్రూరులో ఆదివారం నిర్వహించిన పొద్దుటూరి అవార్డుల కార్యక్రమంలో చైర్మన్ పొద్దుటూరి గౌరీశంకర్ గజమాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అద్భుతమైన జ్యోతిష్య హస్త సాముద్రిక శాస్త్ర నైపుణ్యం కలిగిన సుదర్శనాచార్యులు అభినందనీయులని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు ఇరుకుల్ల రామకృష్ణ, ప్రముఖ వైద్యులు డాక్టర్ జ్ఞానేశ్వర్, గార్లపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.